సాక్షి
మెదక్
మంగళవారం । 19 । ఆగస్టు । 2025

పొంగిపొర్లుతున్న ఘనపురం ఆనకట్ట



ముంచెత్తిన వాన

మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు

- పొంగిపొర్లుతున్న హల్దీ, మంజీరా
- పలు మండలాల్లో కొట్టుకుపోయిన రోడ్లు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన వివిధ పంటలు
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన



అల్లాదుర్గం: బంటికుంట చెరువుకు గండి పడి వృథాగా పోతున్న నీరు

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు ఏకధాటిగా పన్నెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. పలు చోట్ల కుంటలకు గండ్లు పడగా, రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్–కామారెడ్డి సరిహద్దులో గల పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. అటువైపు పర్యాటకులు వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సింగూరు నుంచి దిగువకు నీరు వదటం, దానికి భారీ వర్షాలు తోడు కావడంతో మంజీరా పరవళ్లు తొక్కుతోంది. పది మండలాల్లో అతి భారీ వర్షం నమోదు కాగా, ఏడు మండలాల్లో మోస్తరుగా నమోదు అయిందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.

- వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్– వెల్దుర్తి మధ్య గల హల్దీ వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై నీరు పొంగిపొర్లటంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- శివ్వంపేట ఉసిరికపల్లి, పాంబండ గ్రామాల మధ్య రోడ్డు కొట్టుకుపోయింది. ఫలితంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌లోని లోతట్టు ప్రాంతంలో పలువురి ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. వారు పంచాయతీ కార్యాలయంలో తలదాచుకున్నారు.



అల్లాదుర్గం: నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న బైక్‌ను పట్టుకుంటున్న స్థానికులు

- నర్సాపూర్ మండలం ఖాజీపేటలోని మోతుకుంటకు గండి పడింది. ఇరిగేషన్ అధికారులు దానిని పూడ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.
- అల్లాదుర్గం మండలంలో ఊర చెరువు పొంగిపొర్లటంతో రోడ్డుపై నీరు భారీగా ప్రవహించింది. వరదలో బైక్ కొట్టుకుపోయింది. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
- కొల్చారం మండలంలోని అనేక గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. పంటపొలాలు మునిగిపోగా, ఎనగండ్లకు చెందిన ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు.
- మనోహరాబాద్ మండలంలోని తుపాకులపల్లి, గంగాయిపల్లికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- చిలప్‌చెడ్ మండలం బద్రితండా శివారులోని పోతాన్‌కుంట కట్ట తెగిపోయి నీరు వృథాగా పోతుంది.

మండలాల వారీగా వర్షపాతం (మి.మీ)	
తూప్రాన్	178.5
కొడిపల్లి	172.3
పెద్దశంకరంపేట	164.8
వెల్దుర్తి	158.3
మాసాయిపేట	148.0
శివ్వంపేట	147.0
కొల్చారం	133.0
మనోహరాబాద్	130.0
టేక్మాల్	126.0
నర్సాపూర్	126.0



టేక్మాల్: వర్షాలకు రంగుమారిన పత్తి పంట

మంజీరా.. మహోగ్రం

పాపన్నపేట(మెదక్): మంజీరా మహోగ్ర రూపం దాల్చింది. సోమవారం ఘనపురం ఆనకట్టపై నుంచి 69,700 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎల్లాపూర్ వద్ద మంజీరా ప్రవాహాన్ని పరిశీలించారు. ఐదు రోజులుగా దుర్గమ్మ ఆలయం జల దిగ్బంధంలోనే ఉంది. రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు.

ఆరాతీసిన మంత్రి దామోదర

బొడ్మట్‌పల్లిలో వరద నీటికి ఇళ్లలో చేరిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ డీపీఓ యాదయ్యతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదనీరు రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

- హవేళిఘణాపూర్ మండలం దూప్‌సింగ్ తండా వద్ద గల గంగమ్మ వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- టేక్మాల్ మండలంలోని గుండు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పలువుకి ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

అత్యవసరమైతేనే బయటకు రండి

టేక్మాల్(మెదక్)/వెల్దుర్తి(తూప్రాన్)/తూప్రాన్: గడిచిన 72 గంటల్లో జిల్లాలో భారీ వర్షం కురవడంతో సుమారు పది చోట్ల వంతెనలపై నుంచి వరద ప్రహిస్తుంది, అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలని ప్రజలకు కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. సోమవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఉప్పులింగాపూర్ బ్రిడ్జిని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సింగూరు, మంజీరా, హల్దీవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లో లైన్ రోడ్స్, కాజ్‌వేలు, కల్వర్టులు, బ్రిడ్జిలు ఓవర్ ఫ్లో అవుతున్నందున, ఆయా చోట్ల ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. రానున్న 48 గంటల పాటు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఉన్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో కలెక్టరేట్, పోలీస్ కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో సుమారు 2,600 చెరువులు ఉండగా, అందులో 90 శాతం చెరువులు నిండిపోయాయన్నారు. వరద ప్రవహించే ప్రాంతాల్లో సెల్ఫీలు, చేపలు పట్టడానికి దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట వివిధశాఖల అధికారులు ఉన్నారు.



ఉప్పలింగాపూర్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



తూప్రాన్: గాయత్రినగర్‌లో వరద నీటిలో జనం ఇబ్బందులు



బొడ్మట్‌పల్లిలోని ఓ కిరాణంలో చేరిన వర్షం నీరు

న్యూస్‌రీల్

వీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక అని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్నివర్గాలను కలుపుకొని అప్పటి నియంతృత్వ, నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పాపన్నగౌడ్ పోరాడారని గుర్తుచేశారు. మహనీయుల స్ఫూర్తితో ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సామ్యనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. సీపీఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందన్నారు. మహాధర్నాకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, సతీశ్‌రావు, శ్రీనివాశ్, మహేశ్ కుమార్, ఆయా మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిల్వలపై కఠిన చర్యలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో యూరియా అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఆర్‌ఓ భుజంగరావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా వ్యవసాయం కోసం మాత్ర మే వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

హవేళిఘణాపూర్(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ పీడీ మాణిక్యం సూచించారు. సోమవారం మెదక్ మండలం పేరూరు లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. నిరుపేదల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందదన్నారు. బిల్లులు వెంట వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని పేర్కొన్నారు.

మెదక్ ఆర్టీసీ డిపో సందర్శన



డిపోను పరిశీలిస్తున్న ఖుశ్రోషా ఖాన్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోను సోమవారం రాత్రి ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుశ్రోషా ఖాన్ స్థానిక ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు డిపో గ్యారేజ్, ట్రాఫిక్ సెక్షన్, బస్టాండ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ప్రాంతీయ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కృష్ణమూర్తి, సెక్రటరీ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ నగేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్)/కొల్చారం: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ శివారులో పాత వంతెనపై పొంగిపొర్లుతున్న మంజీరా ప్రవాహాన్ని, బద్రియా తండాలో తెగిపోయిన పోతాన్‌కుంట కట్టను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన చర్యలు చేపట్టాలన్నారు. కురుస్తున్న వర్షాలకు కట్టలు తెగడం, చెరువులకు గండ్లు పడడంలాంటివి జరిగితే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, తహసీల్దార్ సహదేవ్, ఎంపీడీఓ ప్రశాంత్, ఇరిగేషన్ ఏఈ హరీశ్‌రెడ్డి, ఎస్‌ఐ నర్సింహులు, ఆర్‌ఐ సునీల్‌సింగ్ తదితరులు ఉన్నారు. అలాగే కొల్చారం మండలంలోని సంగాయిపేట గ్రామ పెద్ద చెరువు అలుగును పరిశీలించారు. రైతులతో కలిసి గంగమ్మకు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు.



చిట్కుల్ వంతెన వద్ద అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

కదంతొక్కిన అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యా విధానాన్ని అంగన్‌వాడీలకే అప్పగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి వేతనాలను పెంచాలన్నారు. నూతన విద్యా విధానం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపుతారన్నారు. విద్యార్థులు మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, ఎంఈఓ బాలరాజు, మండల వైద్యాధికారి శ్రీకాంత్, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చిత్రపటాన్ని గురుకుల పాఠశాల విద్యార్థి గిఫ్ట్ బహూకరించారు.



విద్యార్థికి నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిన్నారిపై కోతుల దాడి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని చంద్రభవన్ కాలనీలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికపై వెనుక నుంచి దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే చిన్నారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఇదే కాలనీ కాకుండా సాయినగర్ కాలనీ, వెంకటరావు నగర్ కాలనీ, పెద్దబజార్, ఆర్టీసీ కాలనీ, తారకరామ కాలనీతో పాటు అన్ని వార్డులలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


సివిల్ తగాదాల్లో తల దూర్చొద్దు

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్‌మున్సిపాలిటీ: జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సివిల్ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు సివిల్ తగాదాల్లో పోలీసుల ద్వారా బాధపడిన వారు పోలీస్ కంట్రోల్ రూం 8712657888 నంబర్‌కు, లేదా తనను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్‌ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



నిరీక్షించి.. నీరసించి

చేగుంటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

సరిపడా యూరియా అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. క్యూ కట్టి గంటల తరబడి నిరీక్షించినా.. చివరకు సంచి బస్తా దొరుకుతుందో లేదో అన్న ఆందోళన వారిని పట్టి పీడిస్తోంది. ఇది కొంతకాలంగా రైతన్నకు కునుకులేకుండా చేస్తోంది. సోమవారం చేగుంటలోని మక్కరాజీపేట రోడ్డులోని ఫర్టిలైజర్ షాపుకు యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ టోకెన్‌లు అందించి యూరియా అందజేశారు. – చేగుంట(తూప్రాన్)



వైరల్ ఫీవర్రీ

కౌడిపల్లి సీహెచ్‌సీలో జ్వర బాధితులు

మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి జ్వర, జలుబు బాధితులు క్యూ కడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో మార్పు రాగా, జ్వర బాధితులు ఎక్కువయ్యారు. సోమవారం కౌడిపల్లి, కూకుట్లపల్లి, కొట్టాల, శేరితండా, సోమక్కపేట తదితర గ్రామాలు, తండాలకు చెందిన సుమారు 50 మందికి పైగా బాధితులు ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు రోగులను పరీక్షించి వైద్యం అందించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. – కౌడిపల్లి(నర్సాపూర్)

లక్షణంగా ఇందిరమ్మ ఇళ్లు

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారికి డ్వాక్రా రుణం

- మండలాల వారీగా అధికారుల సర్వే
- వివరాల సేకరణలో నిమగ్నం



ఈ చిత్రంలోని మహిళ పేరు రజిత. రామాయంపేట మండలం సదాశివనగర్ తండా. ఈమెకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించలేదు. స్వశక్తి మహిళా గ్రూపు నుంచి రూ. లక్ష రుణం అందజేయగా, పనులు ప్రారంభించింది. ప్రస్తుతం బేస్‌మెంట్ వరకు పూర్తయింది. త్వరలో మొదటి విడత బిల్లు చేతికి అందనుంది. ఇళ్లు మంజూరై ఆర్థికంగా వెనుకబడిన ఇలాంటి వారు ఎందరో జిల్లాలో ఉన్నారు. వారికి చేయూతనివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో వారి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.



రామాయంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా.. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు డబ్బులు లేక పలువురు లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గడువు సమీపిస్తున్నా, ఇప్పటివరకు పనులు షురూ చేయలేదు. ఈ మేరకు వారిని ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా స్వయం సహాయక గ్రూపుల్లో సభ్యులుగా ఉండి, ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించాలని చర్యలు చేపట్టింది. జిల్లాకు మొదటి విడతగా ప్రభుత్వం 9,125 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులను గుర్తించి ప్రాధాన్యం ఇచ్చింది. వారికి నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షలు అందించాలని నిర్ణయించింది. ఆర్థికంగా ఉన్న వారు ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, నిరుపేద లబ్ధిదారులు మాత్రం ఇంకా పనులు ప్రారంభించలేదు. ఇలాంటి వారు జిల్లావ్యాప్తంగా 3,600కు పైగానే ఉన్నారు. వీరికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అండగా నిలుస్తుంది. లబ్ధిదారులు మహిళా గ్రూపుల్లో సభ్యులుగా ఉండి, కనీసం ఆరు నెలలుగా పొదుపు చేస్తున్న వారై ఉండాలని పేర్కొంది. వారిని గుర్తించడానికి మండలాల వారీగా అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. తాము గుర్తించిన లబ్ధిదారులకు రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు గ్రామ సమాఖ్యల ద్వారా రుణం ఇప్పించడానికి కృషి చేస్తున్నారు.

వివరాల సేకరణలో అధికారులు

గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు, ఇంకా పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉన్నతాధికారులు మొదలుకొని గ్రామస్థాయి అధికారులు ప్రతి రోజూ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు వారు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచిస్తున్నారు. ఈ మేరకు నిర్మాణాలు ప్రారంభించని వారి జాబితా రూపొందిస్తున్నారు.

జిల్లా వివరాలు	
మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు	9,125
పనులు ప్రారంభించినవి	5,500
ప్రారంభం కానివి	3,625
బేస్‌మెంట్, గోడల వరకు పూర్తయినవి	1,700

వివరాలు సేకరిస్తున్నాం



జిల్లావ్యాప్తంగా 3,500కు పైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. వారికి అవగాహన కల్పిస్తున్నాం. నిరుపేద స్థితిలో ఉన్న లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. వారు ఖచ్చితంగా మహిళా గ్రూపులో సభ్యురాలై ఉంటే రుణం కోసం వారి వివరాలను డీఆర్డీఓ అధికారులకు పంపిస్తాం.

– మాణిక్యం, పీడీ, గృహ నిర్మాణశాఖ

క్లుప్తంగా

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వివిధ శాఖల అధికారులతో కలిసి పోలీసు సిబ్బంది సమష్టిగా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పోలీసులు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712 667 100కు ఫోన్ చేయాలని సూచించారు.

ఇళ్లు కూలి.. ముగ్గురికి గాయాలు



పత్తికుంట తండాలో కూలిన ఇల్లు

పుల్‌కల్(అందోల్): భారీ వర్షాలకు మండలంలోని పాత ఇళ్లు కూలుతున్నాయి. పత్తికుంట తండా, పోచారం గ్రామంలో సోమవారం ఇళ్లు కూలడంతో ముగ్గురు గాయపడ్డారు. పత్తికుంట తండాలో తేజావత్ జితేందర్ ఇళ్లు కూలి మట్టి పెళ్లలు మీద పడటంతో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు సునీత, కార్తీక్‌కు గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఎస్‌ఐ విశ్వజన్ , ఎంపీఓ వేంకటేశ్వర్ రెడ్డి పరామర్శించారు. బాధితులకు కొత్త ఇంటిని మంజూరు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కల్తీ కల్లు విక్రయిస్తే చర్యలు

పాపన్నపేట(మెదక్): జిల్లాలో కల్తీకల్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీటీఎఫ్ సీఐ గోపాల్ హెచ్చరించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని గాజులగూడెం, కొత్తపల్లి, అన్నారం, అబ్లా పూర్, యూసూఫ్‌పేట, కొడపాక, పొడ్చన్‌పల్లి, కుర్తివాడ, నార్సింగి గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కల్తీ కల్లు విక్రయించడం నేరమని, దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు కల్లు దుకాణాల్లో సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం మెదక్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించనున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హుస్నాబాద్‌రూరల్: రోరోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా... స్థానికుల కథనం ప్రకారం... అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన అఖిల్ (25) హుస్నాబాద్ నుంచి బైక్‌పై గ్రామానికి వెళుతున్నాడు. పోతారం(ఎస్) క్రాసింగ్ దగ్గర వర్షానికి బైక్ అదుపు తప్పిరోడ్డు పక్కన ఉన్న కందకంలో పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వాహనదారులు చూసి 108కి సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

చిన్న వ్యాపారాలపై సర్వే

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గణాంక కార్యాలయం కరీంనగర్ బృందం సర్వే నిర్వహించింది. వ్యవసాయేతర రంగంలోని చిన్న వ్యాపారాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకునేందుకు ఈ సర్వే చేపట్టినట్లు అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అసంఘటిత సేవా రంగం, అసంఘటిత భవన నిర్మాణాలపై అయ్యే ఖర్చులపై సర్వే నిర్వహించారు. బృంద సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

మెదక్ కలెక్టరేట్: గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం రాత్రి హవేళిఘణాపూర్ మండలం బూర్గుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన ఇండ్ల నరేశ్‌కు కామారెడ్డి జిల్లా అరుగొండ రాజంపేటకు చెందిన సత్యతో నాలుగేళ్ల క్రితం పెళ్లి జరిగింది. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. గ్రామంలో బంధువుల పెళ్లి ఉండగా 4రోజుల క్రితం వచ్చారు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో సత్య బెడ్రూంలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. గమనించిన ఆమె అత్త దుర్గమ్మ తలుపులు తట్టినా తీయలేదు. దీంతో కొడుకు నరేశ్‌కు, ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో వారొచ్చి తలుపులు తెరిచి చూడగా ఉరివేసుకొని ఉంది. వెంటనే స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో ఆమె భర్త నరేశ్ మృతురాలి శవాన్ని ఇంటి అరుగుపై పడుకోబెట్టి పారిపోయినట్లు సమాచారం. కాగా మృతురాలు 4నెలల గర్భిణి అని తెలిసింది. మృతురాలి తల్లిదండ్రులు తమ బిడ్డను అల్లుడు నరేశ్ హత్య చేశాడని ఆందోళన చేపట్టగా పోలీసులు సముదాయించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



నాటేస్ ఐడియా..



సాయం సంధ్యలో ఒదిగేలా









ఎదగాలన్న తపన ఉంటే ఎక్కడైనా..

చిత్రం అబ్బురం.. జ్ఞాపకం పదిలం



నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

రెప్పపాటులో జరిగిపోయే దృశ్యాలను ఒక్క క్షణంలో ఆవిష్కృతం చేసేది ఒక్క కెమెరానే. కెమెరాలో బందీ అయిన ప్రతి చిత్రం అబ్బుర పరుస్తుంది. చిరకాలం పదిలంగా మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. జ్ఞాపకాలకు శాశ్వతంగా ప్రాణం పోసేది ఫొటో. శ్రమైక జీవుల సౌందర్యం, ప్రకృతి మనోహర దృశ్యాలు, పశుపక్షాదులు, పూలసోయగాలు.. ఇలా పదిలంగా ఉంచేదే చిత్రం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సాక్షి క్లిక్ మనిపించిన చిత్రాలు.

- సిద్దిపేట / సంగారెడ్డి సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు / మిరుదొడ్డి(దుబ్బాక)



సంధ్య వేళ..పక్షుల సందడి



పచ్చని పొలాల సోయగం



కాకి 'బలగం'



గూడు వద్ద రామచిలుక..

అరటి సాగు.. బాగు



జహీరాబాద్ ప్రాంతంలో పండిస్తున్న అరటి తోట

ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- పెరుగుతున్న విస్తీర్ణం
- జిల్లాలో సుమారు 2వేల ఎకరాల్లో సాగు

జహీరాబాద్ టౌన్: అరటికి ఏ సీజన్‌లోనైనా మంచి డిమాండ్ ఉంటుంది. ఏడాది పొడవునా సాగుకు అనుకూలంగా వాణిజ్యపరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకోవడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అరటి పంటతో పాటు పిలకలు, ఆకులకు గిరాకీ ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులతో అధిక లాభాలు సాధించవచ్చు. జిల్లాలో జహీరాబాద్, నారాయణ ఖేడ్ తదితర ప్రాంతాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో అరటి పంటను సాగు చేస్తున్నారు.

జిల్లాలో ఏడాది పొడవునా అరటికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఎర్రటి, నల్లరేగడి నేలలు సాగుకు అనుకూలం. జహీరాబాద్ డివిజన్‌లో వ్యవసాయ బావులు ఎక్కువగా ఉండటంతో నీటి తడులకు ఢోకాలేదు. జిల్లాలో జహీరాబాద్, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్, గుమ్మడిదల, కొండాపూర్ తదితర మండలాల్లో అరటి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. జహీరాబాద్ డివిజన్‌లో సాగు విస్తీర్ణం ఎప్పుడు తగ్గడం లేదు. ఒక్క జహీరాబాద్ డివిజన్‌లోనే ప్రతి సంవత్సరం సుమారు 500 పైగా ఎకరాల్లో పంట సాగవుతుంది. జిల్లా మొత్తం కలిపి సుమారు 2వేల ఎకరాల్లో అరటి పంటను రైతులు పండిస్తున్నారు. గతంలో మనూర్ మండలంలో పెద్ద ఎత్తున పండించే వారు. మంచి దిగుబడి వచ్చినా కొనడానికి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో పంట సాగు పట్ల రైతులకు ఆసక్తి తగ్గింది. ఇప్పుడు అరటికి డిమాండ్ పెరగడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహించడం వల్ల సాగుకు అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ రాయితీ

పండ్ల తోటల సాగును ప్రోత్సహించడంతో భాగంగా ప్రభుత్వం అరటి సాగు విస్తీర్ణం పెంచేందుకు రాయితీ అందిస్తుంది. అరటిని టిష్యూ కల్చర్, పిలకలు, గడ్డల పద్ధతిలో సాగు చేస్తారు. టిష్యూ కల్చర్, పిలకల పద్ధతికి ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ ఇస్తుంది. ఎకరాకు సుమారు రూ.35 వేల వరకు ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు రాయితీ అందిస్తుంది. డ్రిప్ పరికరాలకు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

రెండేళ్ల నుంచి మంచి ఆదాయం



50 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్న. దిగుబడి బాగానే వస్తుంది. మూడేళ్ల క్రితం నష్టాలు చవిచూశాం. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇప్పుడు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ సంవత్సరం మధ్యప్రదేశ్ నుంచి వ్యాపారులు వచ్చి సరైన ధరకు కొంటున్నారు. మూడేళ్ల క్రితం రూ.4 కిలో అమ్ముడు పోగా ఇప్పుడు రూ.20 కిలో చొప్పున కొంటున్నారు.

– నల్ల నాగేశ్వర్ రెడ్డి, రైతు, రంజోల్

మంచి డిమాండ్ ఉంది



అరటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జహీరాబాద్ డివిజన్ పరిధిలో అనుకూల వాతావరణం ఉన్నందున మంచి దిగుబడులు వస్తాయి. ఈ ప్రాంతంలో అరటి విస్తీర్ణం ఎప్పుడు తగ్గడం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తున్నందున సాగు విస్తీర్ణం పెరుగుతుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే అరటి సాగులో అధిక లాభాలు సాధించవచ్చు. పంట సాగు విషయంలో అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. విత్తన శుద్ధి చేపట్టి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

– పందరి, ఉద్యానశాఖ అధికారి, జహీరాబాద్

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రి దామోదర ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి దామోదర

నర్సాపూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నర్సాపూర్ మీదుగా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామానికి వెళ్తుండగా స్థానిక ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ లతో పాటు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పలువురు నాయకులతో పట్టణ శివారులో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను గమనించాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఎవరైనా నివసిస్తుంటే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. చెరువులు కుంటలను పరిశీలించాలని, పేదల ఇండ్లు కూలిపోతే నివేదిక ఇవ్వాలని సూచించారు.

జాతీయ క్రీడలకు విద్యార్థులు ఎంపిక

అభినందించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): కొండపాక హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యా పత్యా జాతీయ క్రీడలకు ఎంపికయ్యారని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే జాతీయ క్రీడలకు ఎస్ శరణ్య, ఎం.శ్రీరామ్, సీహెచ్ సాత్విక తెలంగాణ జట్టులో ఎంపికయ్యారు. దీంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగాల్లో విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతుల ప్రశాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- తండ్రీకొడుకు మృతి
- చండ్లాపూర్, గంగాపూర్ గ్రామాల్లో విషాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆ తండ్రీకొడుకుల అనుబంధంపై విధికి కన్నుకుట్టింది. వారిని శాశ్వతంగా విడదీసింది. పెళ్లి వేడుకల ఆనందం ముగియకముందే ఆ కుటుంబంలో శోకం మిగిల్చింది. వారి మరణం రెండు గ్రామాల్లో విషాదం మిగిల్చింది. మండల పరిధిలోని చండ్లాపూర్ గ్రామానికి చెందిన మూర్తి గజేందర్ రెడ్డి(50)కి భార్య పద్మ, కుమారుడు రాజిరెడ్డి(27), కూతురు సంతోషి ఉన్నారు. వీరికి గంగాపూర్ శివారులో ఎకరం సాగు భూమి ఉంది. ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 14న కూతురు సంతోషి పెళ్లి ఘనంగా జరిపించారు. పెళ్లి పనులు పూర్తి కావడంతో సోమవారం తండ్రి, కొడుకు అడవి పందుల బెడద నుంచి మొక్కజొన్న పంటను రక్షించేందుకు వైరు చుడుతున్నారు. ఈ క్రమంలో విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. పెళ్లింట విషాదం నెలకొనడంతో ఇటు చండ్లాపూర్, సాగు చేస్తున్న గంగాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది. ఘటనా స్థలానికి చేరుకున్న రెండు గ్రామాల ప్రజలు, బంధువులు తండ్రి, కొడుకు మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

చేపల వేటకు వెళ్లి.. అదృశ్యం



దుర్గేశ్

కొల్చారం(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఏషబోయిన దుర్గేశ్ ఆదివారం ఉదయం గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలోని మంజీరా నదికి చేపల కోసం వెళ్లాడు. సోమవారం సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సోదరుడు నర్సింహులు పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



విట్టల్

ఝరాసంగం(జహీరాబాద్): గ్యాస్ లీకైన ఘటనలో మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా... మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలో ఈనెల 6న గ్యాస్ లీకై మంటలంటుకొని ఒకే కుటుంబంలోని తల్లి శంకరమ్మతో పాటు కుమారులు ప్రభు కుమార్, విట్టల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈనెల 6న తల్లి, 15న ప్రభు కుమార్ మృతి చెందారు. సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్న కుమారుడు విట్టల్(32) మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. భార్యతో పాటు కుమారులకు అంత్యక్రియలు నిర్వహించిన తండ్రి బక్కన్న గుండెలవిసేలా ఏడ్చారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు

తల్లి మృతి, కుమారుడికి స్వల్ప గాయాలు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా, నిజాంపేట మండలం.. బాచుపల్లి గ్రామానికి చెందిన పరమేశ్, తల్లి సంతోష (48) ఇద్దరు కలిసి బైక్‌పై ఆదివారం కూలీ పనికి ఇస్నాపూర్‌కు వచ్చారు. పని దొరకకపోవడంతో తిరిగి సోమవారం మధ్యాహ్నం ఇస్నాపూర్ నుంచి వెళ్తుండగా రుద్రారం సమీపంలోని సిగ్నోడ్ కంపెనీ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న సంతోష కిందపడగా, ఆమె తలపై నుంచి బస్సు టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆరూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్టానికి చెందిన శ్యామ్రావు(46) పది రోజుల క్రితం బతుకుదెరువు నిమిత్తం సదాశివపేట పట్టణానికి వచ్చాడు. ఉదయం ఆరూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హత్య కేసులో జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైమ్ : హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు శిక్ష పడింది. సంగారెడ్డి పట్టణ పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన సంజయ్ లక్ష్మణ్ కంబై వృత్తిరీత్యా కూలి పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో 2020 జూన్ 7వ తేదీన తోటి అల్లుడు ఉత్తమ రామ యాడ్కెను కొత్త బస్టాండ్ సమీపంలో గల ప్రింటర్ ప్రెస్ ఎదుట బండరాయితో తలపై కొట్టి చంపాడు. అప్పటి ఇన్‌స్పెక్టర్ రమేశ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో నిందితున్ని కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలు విన్న జిల్లా న్యాయమూర్తి భవాని చంద్ర నిందితునికి జీవిత ఖైదుతోపాటు రూ. 3వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. ఎస్‌హెచ్‌ఓ, ఇన్వెస్టిగేషన్ అధికారి వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పి.రమేశ్ తదితరులను జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ అభినందించారు.

మందుబాబులకు జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 21 మందికి మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున , మరో ఇద్దరికి రూ. 1500, మరో వ్యక్తికి రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ. 2500 జరిమాన విధించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎస్‌ఐ కృష్ణారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి రోడ్డులో కాళేశ్వరం కాల్వ సమీపంలో బైక్‌పై వెళుతుండగా తనిఖీ చేయగా 700 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీస్ సిబ్బంది జనార్దన్, శశికాంత్, ఖాజా, లింగం, రవి, సత్యనారాయణ, మహేశ్ పాల్గొన్నారు.


మైనర్‌పై అత్యాచారం..

నిందితునికి 20 ఏళ్ల జైలు, జరిమానా

దుబ్బాకరూరల్: బాలికపై అత్యాచారం చేసిన నిందితునికి పోక్సో కేసులో కోర్టు కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధించింది. సిద్దిపేట సీపీ అనురాధ వివరాల ప్రకారం... అక్బర్‌పేట - భూంపల్లి మండలానికి చెందిన పర్స శ్రీనివాస్(48) 2022, ఫిబ్రవరి 16న రాత్రి 10.30గంటలకు బహిర్భూమికి వెళ్లిన బాలిక నోట్లో చున్నీ కుక్కి లైంగికదాడి చేశాడు. బాలిక కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి దుబ్బాక సీఐ ఎం.కృష్ణ కేసు పరిశోధన చేసి నేరస్తుడిని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోమవారం సిద్దిపేటలోని ఫస్ట్‌క్లాస్ అదనపు డిస్ట్రిక్ట్ కోర్టు, సెషన్స్ జడ్జి శ్రీజయప్రసాద్ వాదనలు విన్న తర్వాత నేరం రుజువైనందున నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. ఎస్‌ఐ హరీష్, సీఐ శ్రీనివాస్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సిబ్బందిని సీపీ అభినందించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను జిల్లా టాస్క్ ఫోర్స్(డీటీఎఫ్), సంగారెడ్డి టీం సభ్యులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద డీటీఎఫ్ బృందం సభ్యులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రావెల్ బస్సులో తీసుకొస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన 74 మద్యం బాటిళ్లు(42 లీటర్ల)ను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్లను జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సీఐ వీణారెడ్డి, ఎస్‌ఐలు హనుమంతు, రమేశ్, మురళి, రాజ, ఉమారాణి ఉన్నారు.



డీటీఎఫ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

బీడీ పరిశ్రమను కాపాడండి

కేంద్ర మంత్రికి బీఎంఎస్ వినతి



కేంద్ర మంత్రితో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేటజోన్: గ్రామీణ కుటీర పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమను కాపాడాలని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు సోమవారం తెలంగాణ భారతీయ మాజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని జాతీయ బీఎంఎస్ కార్యదర్శి సురేంద్రన్, అఖిల భారత బీడీ మాజ్దూర్ మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్‌లతో కలిసి ఆయన పలు సమస్యలపై వివరించారు. తెలంగాణలో 10 లక్షల మంది బీడీ కార్మికులున్నారని తెలిపారు. ప్రస్తుతం బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉందని, పెంచే ఆలోచన విరమించి 5 శాతానికి కుదించాలని కోరారు.